ఎటాకింగ్ ప్రవీణ్

- వాలీబాల్‌లో రాణిస్తున్న స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి
- కౌంటర్ ఎటాకింగ్‌లో సత్తా
- జాతీయ స్థాయిలో ప్రతిభ



బెస్ట్ ప్లేయర్ పతకంతో ప్రవీణ్ (ఫైల్)

ఉక్కునగరం: చిన్నప్పటి నుంచే వాలీబాల్ అంటే మక్కువ. సాధన చేస్తూ ప్రతిభ చాటుకున్నాడు. అలా ఎదుగుతూ జాతీయ జట్టులో స్థానం సంపాదించాడు. అనుకున్నది సాధించిన ఆ యువకుడు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కలలగంటున్నాడు. స్టీల్‌ప్లాంట్ ఇంజనీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ విభాగంలో మాస్టర్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తూ వాలీబాల్‌లో సత్తా చాటుకుంటున్న ప్రవీణ్. తండ్రి సూర్యారావు కోక్ ఓవెన్స్ విభాగంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్‌గా పదవీ విరమణ చేశారు. తండ్రి స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తుండగా ప్రవీణ్ 2006లో స్టీల్‌ప్లాంట్ జట్టులో క్రీడాకారుడిగా ప్రవేశించాడు. మంచి ఎత్తు ఉండటంతో కీలక ఆటగాడిగా మారిపోయాడు. కౌంటర్ ఎటాకింగ్ ప్లేయర్‌గా సత్తా చాటుకుంటూ అందరి మన్ననలు పొందుతున్నాడు. జిల్లా స్థాయిలో అనేకసార్లు పతకాలు సాధించిన ప్రవీణ్ జాతీయ ఇంటర్ స్టీల్ వాలీబాల్ పోటీల్లో క్రీడాకారుడిగా రాణించాడు. 2008లో స్టీల్‌ప్లాంట్‌లో చేరిన ప్రవీణ్ అప్పటి నుంచి ప్రతీసారి ఇంటర్ స్టీల్ పోటీల్లో పాల్గొంటున్నాడు. ప్రవీణ్ స్టీల్‌ప్లాంట్ జట్టులో చేరిన తర్వాత జరిగిన పోటీల్లో పలుమార్లు జట్టు విజేతగా నిలిచింది. స్టీల్‌ప్లాంట్ జట్టు 2012, 2022లో కాంస్య పతకం సాధించగా.. 2016లో బంగారు పతకం కైవసం చేసుకుంది. ప్రవీణ్ కెప్టెన్సీలో స్టీల్‌ప్లాంట్ జట్టు బంగారు పతకం గెలుపొందడటం విశేషం. ఈ పోటీల్లో ప్రవీణ్ పలుమార్లు బెస్ట్ ప్లేయర్ పతకాలు అందుకున్నాడు. అదే విధంగా ప్రతీ ఏడాది జిల్లా స్థాయిలో జరిగే లేబర్ వెల్ఫేర్ మీట్‌లో స్టీల్‌ప్లాంట్ జట్టు ఇప్పటికి 12 సార్లు విజేతగా నిలిచింది. అంతకు ముందు 2008 నుంచి 2014 మధ్య జరిగిన ఇంటర్ డిపార్ట్‌మెంటల్ వాలీబాల్ పోటీల్లో ప్రవీణ్ కెప్టెన్సీలో అనేక షీల్డులు గెలుపొందింది. అందులో ప్రతీ పోటీలో ప్రవీణ్ పాల్గొంటూ జట్టు గెలుపులో ముఖ్య భూమిక పోషించాడు.



ఇంటర్ స్టీల్ విజేతలుగా షీల్డు అందుకుంటున్న స్టీల్‌ప్లాంట్ జట్టు (ఫైల్)

క్రీడాకారులకు శిక్షణ

ఇంటర్ స్టీల్‌ప్లాంట్ వాలీబాల్ పోటీల్లో దేశంలోని అన్ని స్టీల్‌ప్లాంట్లకు చెందిన జట్లు పాల్గొంటాయి. అందులో స్టీల్‌ప్లాంట్ జట్టు బలమైనది అయినప్పటికి ప్రతీసారి స్టీల్‌ప్లాంట్ జట్టు విజేతగా నిలవాలన్నది మా ఆకాంక్ష. అందుకు తగ్గట్టు ప్రాక్టీస్ చేస్తున్నాం. అదే విధంగా కొత్త క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడం ద్వారా మరింత మంది క్రీడాకారులను సిద్ధం చేయాలని ప్రయత్నిస్తున్నాం.

– వడ్డి ప్రవీణ్, వాలీబాల్ క్రీడాకారుడు

ఐస్‌తో ప్రతిమలు



ఐస్‌తో తయారుచేసిన శివలింగం, దుర్గాదేవి అమ్మవారి ప్రతిమలు

అక్కిరెడ్డిపాలెం: శరన్నవరాత్రి మహోత్సవాలను 68, 69వ వార్డుల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం అక్కిరెడ్డిపాలెంలో శ్రీ దుర్గమాంబ, కుంచమాంబ యూత్ ప్రతినిధులు ఆధ్వర్యంలో ఐసుతో తయారు చేసి శివలింగం, దుర్గాదేవి అమ్మవారి ప్రతిమలను ప్రతిష్ఠించారు. గ్రామంలో జరిగిన మరో కార్యక్రమంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు సంద్రాన సూకరాజు, జాజుల రవి, గొంతిన సత్యవతి, శ్రీనివాసరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. 69వ వార్డు తుంగ్లాంలో దుర్గాదేవి అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన దీపారాధన పలువురిని ఆకట్టుకుంది.



తుంగ్లాంలో దుర్గాదేవి సన్నిధిలో దీపాలంకరణ

ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలి

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు ఎస్.రామారావు, యు.రామస్వామి డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ యత్నాలకు నిరసనగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో 1,337వ రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయబోమని, సొంతగనులు కేటాయించాలని, తక్షణ సాయంగా రూ.పది వేలకోట్లు విడుదల చేయాలని, ఇవేవి సాధ్యం కాదని భావించిన పక్షంలో వెంటనే సెయిల్‌లో విలీనం చేయాలన్నారు. సుదీర్ఘ కాలం నుంచి ఉక్కు పరిరక్షణ కోసం వివిధ రకాల ఆందోళనలు, పోరాటాలు చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. ప్రతిపక్షంలో ఉండగా ఉక్కు పరిరక్షణ కోసం ఉద్యమాలు చేపడతామని, రకరకాల హామీలు గుప్పించిన టీడీపీ వాటి మిత్రపక్షాలు నేడు కప్పదాటుగా వ్యవహరిస్తుండడం తగదన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్లే ప్లాంట్‌కు నేడు ఈ దుస్థితి కల్గిందన్నారు. గంగాధర్, కె.ఆర్.కె.రాజు, పుల్లారావు, దేముడునాయుడు, బలశౌరి, రాజు, వి.మురళీ, మొహిద్దీన్, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, రామచంద్రరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరిరక్షణ కమిటీ నాయకులు

క్లుప్తంగా

ఘనంగా కులుకూరి వర్ధంతి



పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మంగరాజు తదితరులు

పెదగంట్యాడ: సామాజిక సేవకుడు కులుకూరి సుబ్బారావు 14వ వర్ధంతిని జీవీఎంసీ 73వ వార్డు పరిధి కర్ణవానిపాలెంలో కుమారుడు కులుకూరి మంగరాజు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పారిశుధ్య కార్మికులకు దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం గాజువాక ఆర్యవైశ్య సంఘం కల్యాణ మండపం వద్ద పేదలకు అన్నదానం చేశారు. అనాథ పిల్లలకు నిత్యవసరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేసారపు శ్రీను రమష్, నంబూరు జగన్నాథం, బెవర సత్యనారాయణ, అప్పలరాజు, బెల్లాల పెంటబాబు, వెంకటరావు, ప్రభూజీ,శ్రీను, రామకృష్ణ, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు, న్యాయవాదులు

గాజువాక : మానసిక ఆరోగ్యంపై గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినం సందర్భంగా గాజువాక బార్ అసోసియేషన్‌తో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.సుధాకర్ మాట్లాడుతూ మానసిక సమస్యలకు గురయ్యే పరిస్థితులను, వాటి నివారణోపాయాలను వివరించారు. సాధ్యమైనంతవరకు ఒత్తిడికి దూరంగా ఉండాలని, దురలవాట్లనుంచి బయట పడాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ బద్రినాథ్, సీహెచ్‌వో నాగ అప్పారావు, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బి.ప్రభాకరరావు, టి.పుల్లయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మానవతావాది రతన్ టాటా

అగనంపూడి: పారిశ్రామిక దిగ్గజం, భారతదేశ ప్రగతిలో వెన్నెముక లాంటి మానవతావాది రతన్ టాటా మరణం తీరని లోటని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ పేర్కొన్నారు. అగనంపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ టాటా గ్రూపు ద్వారా వ్యాపారంతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టిన మహోన్నత వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి అన్నారు. భారతదేశం ఒక దిగ్గజాన్ని కోల్పోయిందన్నారు.

ఆర్టీఐ లేఖకు లభించని సమాధానం

అగనంపూడి: సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోసం లేఖలు రాస్తే వాటిని బుట్టదాఖలు చేస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ భూసేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌పై చర్యలు తీసకోవాలని గుదే సత్య విజయలక్ష్మి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అగనంపూడి పునరావాసకాలనీకి చెందిన ఇళ్ల స్థలాల వివరాల కోసం అధికారిని వివరాలు అడిగితే ప్రజాప్రతినిధులు వివరాలు ఇవ్వొద్దన్నారని చెబుతూ రెండు మూడు మాసాల నుంచి లేఖలకు సమాధానం ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

12న రావణ వధ

దాబాగార్డెన్స్ : ఈ నెల 12న విజయదశమిని పురస్కరించుకుని గంభీరంలో గల హరేకృష్ణ వైకుంఠ మందిర ప్రాంగణంలో పెద్ద ఎత్తున విజయదశమి ఉత్సవాలు, రావణ వధ నిర్వహించనున్నట్టు హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి శ్యామమాధవ దాస పేర్కొన్నారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో తొలిసారిగా విజయ దశమి ఉత్సవాలు జరుగుతాయన్నారు.

వాడవాడలా అన్న సమారాధన



భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు పైడిరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: దేవి శరన్నవరాత్రులు ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని ఈసరపువానిపాలెం, నమ్మిదొడ్డి కూడలిలో ప్రతిష్ఠించిన దుర్గ మండపాలు వద్ద గురువారం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. 77వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు బట్టు పైడిరెడ్డి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు బట్టు అప్పలరెడ్డి, ఎంపీ రెడ్డి, కర్రి అప్పారావు, సావాడ అప్పలరెడ్డి, కర్రి అప్పారావు, సతీష్, కాకి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అన్న సంతర్పణలు... అభిషేకాలు

అగనంపూడి: దుర్గాదేవి నవరాత్రుల్లో భాగంగా 8వ రోజు 87వ వార్డు గవర వీధిలోని దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీదుర్గా గౌరీ యూత్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు ఘనంగా జరిపించారు. 25 ఏళ్లగా కార్యక్రమంలో కొనసాగిస్తున్న నిర్వాహకుల్ని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి శ్రీనివాసరావు రమాదేవి దంపతులు అభినందించారు. ముందుగా పూజలు నిర్వహించి అనంతరం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కణితి కాలనీలో దుర్గాదేవి ఉత్సవాలు సందర్భంగా విశేష అన్న సమారాధన చేపట్టారు. ముందుగా అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తరువాత విశేష అన్న సమారాదన కార్యక్రమాన్ని చేపట్టారు. నిర్వాహకులు కాకి మధు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పారిశ్రామికవేత్త చిగిలిపల్లి రవి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కరాజు రామారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, సబ్బవరపు ఈశ్వరరావు, దాసరి అప్పడు పాల్గొన్నారు.



గవర వీధిలోని అన్నసమారాధనలో పాల్గొన్న నాయకులు

పోగొట్టుకున్న బ్యాగ్ అందజేత

అక్కిరెడ్డిపాలెం: పోగొట్టుకున్న బ్యాగును గాజువాక క్రైం పోలీసులు కనిపెట్టి తిరిగి బాధితునికి అందజేసి శభాష్ అనిపించుకున్నారు. వివరాల ప్రకారం నక్కపల్లికి చెందిన మణివర్మ గాజువాకలోని గాయత్రి విద్యా పరిషత్ కళాశాలలో బీటెక్ సీఈసీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. గురువారం నక్కపల్లి నుంచి గాజువాకలోని బంధువుల ఇంటికి శుభకార్యం నిమిత్తం వచ్చాడు. కార్యక్రమం చూసుకుని తిరిగి నక్కపల్లికి వెళ్లే క్రమంలో బీసీ రోడ్డులో ఆటో ఎక్కి పాతగాజువాక బస్‌స్టాప్‌కు వచ్చాడు. ఈ సమయంలో తన బ్యాగును ఆటోలో మర్చిపోయాడు. పరధ్యానంగా పాతగాజువాక బస్‌స్టాప్‌లో అడ్డురోడ్డు బస్ ఎక్కేశాడు. కొంత దూరం వెళ్లిన తర్వాత తన బ్యాగును గుర్తుకు తెచ్చుకోగా.. ఆటోలో మర్చిపోయినట్లు గ్రహించాడు. వెంటనే డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించాడు. గాజువాక క్రైం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఆదేశాలతో సకాలంలో స్పందించిన గాజువాక క్రైం కానిస్టేబుల్ సీతారామయ్య పాతగాజువాక జంక్షన్‌లో పలు సీసీ కెమెరాలను చెక్ చేస్తుండగా బాధితుడు బ్యాగును మర్చిపోయిన ఆటోను గుర్తించారు. వెంటనే అలర్ట్ అయిన సీతారామయ్య ఆటోను గుర్తించి బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. వెంటనే బాధితునికి సమాచారం అందించి గాజువాక పోలీస్ స్టేషన్‌లో బ్యాగును అందజేశారు. బ్యాగులో రూ.1.70 లక్షల విలువ చేసే ల్యాప్‌టాప్, సెల్ ఫోను ఉందని బాధితుడు పోలీసులకు తెలిపాడు. పోలీసులు సకాలంలో స్పందించడంతో తన బ్యాగును అందించారన్నారన్నారు.



మణివర్మకు బ్యాగ్ అందజేస్తున్న గాజువాక క్రైం కానిస్టేబుల్ సీతారామయ్య

గ్రామదేవత స్థలాన్ని కాపాడాలి


అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలస గ్రామదేవత బంగారమ్మ ఆలయ స్థలాన్ని కాపాడాలని ఆలయ సమీపంలో స్థానికులు నిరసన తెలిపారు. గతంలో ఈభూముల ఆక్రమణలను అధికారులు అడ్డుకున్నారని, అయితే ప్రభుత్వం మారిన వెంటనే ఆక్రమణ దారుల స్థానిక నాయకులు అండతో ఆక్రమించేందుకు ఉపక్రమిస్తున్నారని ఆందోళనకారులు ఇందల అశోక్ కుమార్, పుచ్చా మణిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామదేవత స్థలాన్ని కాపాడాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, అలాగే కబ్జాదారులకు అండగా నిలుస్తున్న నాయకులపై రాష్ట్ర నిఘా విభాగం అధికారులకు ఫిర్యాదు చేస్తున్నామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇందల సాంబశివరావు, లక్ష్మణ్, పరదేశమ్మ, రాము, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న స్థానికులు

పోరాటాలతోనే కులవివక్షకు అడ్డుకట్ట

ఉక్కునగరం: కులవివక్షకు వ్యతిరేకంగా ప్రతి ఘటనా పోరాటాలు జరగాలని తద్వారానే రాజ్యాంగాన్ని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం. సుబ్బన్న అన్నారు. కేవీపీఎస్ 26వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్టీల్ డివిజన్ ఆధ్వర్యంలో గురువారం ఉక్కు టీటీఐ బిల్డింగ్ వద్ద కేవీపీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని కులవ్యవస్థ భారతదేశంలోనే ఉందన్నారు. తోటి మనిషిని మనిషిగా చూడని అత్యంత హీనమైన, దుర్మార్గమైన సంస్కృతి నేటికీ మన దేశంలో కొనసాగుతోందన్నారు. ఇది అత్యంత అవమానకరమన్నారు. కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి ఎస్. సత్యనారాయణ మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం దుర్మార్గమైన పాలన చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వి. ప్రకాశ్ వరకుమార్, టి. చిరంజీవి, కె.గంగాధర్, కేపీ సుబ్రహ్మణ్యం, కేవీ ప్రసాద్, వై. సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.



కేవీపీఎస్ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

దుర్గమ్మకు జన నీరాజనం



గంగమ్మ అవతారంలో బాలాజీ

పెదగంట్యాడ: దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారి సేవలో గురువారం భక్తులు తరించారు. జీవీఎంసీ 75వ వార్డు పరిధిలో ధర్మాల వీధిలో పెంటమాంబ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అమ్మవారిని గురువారం విశేషంగా అలంకరించారు.ప్రత్యేక పూజలు చేశారు.

ఈ సందర్భంగా పలువురు మహిళలు నవ దుర్గలుగా వేషధారణలో అలరించారు. పుష్ప–2 వేషధారణలో బాలాజీ అనే భక్తుడు ఆకట్టుకున్నాడు. అనంతరం అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు.కార్యక్రమంలో 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి పాల్గొన్నారు. జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి పంచాయతన ఆలయంలో అమ్మవారిని దుర్గ అవతారంలో భక్తులకు దర్శమిచ్చారు,.అమ్మవారికి విశేష పూజలు చేశారు. దుర్గ హోమం చేశారు,అనంతరం పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని కుంకుమార్చనలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి, కొల్లా అప్పలరాజు, మొగలపల్లి త్రిమూర్తులు, బొండాడ వెంకటేశ్వరరావు, నాగమళ్ల ప్రబోజీ తదితరులు పాల్గొన్నారు.



కన్యకా పంచయాతన ఆలయంలో హోమంలో పాల్గొన్న భక్తులు



దిబ్బపాలెంలో ఘటాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

దుర్గాదేవి అవతారంలో...

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి కూడలి సమీపంలోని దుర్గాలమ్మ అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో దుర్గాలమ్మను దుర్గాదేవి అవతారంలో అలంకరింపజేశారు. ఈ సందర్భంగా అమ్మవార్ని నిమ్మకాయలతో అలంకరింపజేశారు. సాయంత్రం అమ్మవార్ని పల్లకి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో భవానీలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పల్లకి సేవలో పాల్గొన్నారు.

విశేష అవతారాలు

ఉక్కునగరం: త్రిశక్తి దేవాలయంలో శరన్నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం శ్రీమహాదుర్గ అమ్మవారు ఎరుపు వర్ణం చీరలో మహాదుర్గాదేవి, శ్రీమహాలక్ష్మి అమ్మవారు గులాబి వర్ణం చీరలో . విజయలక్ష్మి అవతారంలో, శ్రీమహాసరస్వతి అమ్మవారు కాషాయ వర్ణం చీరలో బ్రహ్మచారిణి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. సాయంత్రం అమ్మవారకు ఉయ్యాల సేవ నిర్వహించారు. అనంతరం ఆలయం ఆవరణలో సహస దీపాలంకరణ సేవ చేశారు. ఉక్కునగరం, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తుల పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఊంజల్ సేవలో త్రిశక్తి అమ్మవార్లు



అగనంపూడి : దుర్గాదేవి అవతారంలో ..

భక్తిశ్రద్ధలతో ఘటాల ఊరేగింపు

అగనంపూడి: దుర్గాదేవి శరన్నవరాత్రులు పురస్కరించుకొని 85వ వార్డు దిబ్బపాలెం బొర్రమాంబ స్టార్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా ఘటాల ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా సదకం పట్టు నుంచి ఘటాలను ఊరేగింపుగా తీసుకొని దిబ్బపాలెం వీధుల్లో, శనివాడ, శనివాడ ఎస్సీకాలనీ, బొర్రమాంబ కాలనీ, ప్రధాన రహదారి తలారి వానిపాలెం గ్రామాల్లో సాగింది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఈగల నరసింగరావు, యలమంచిలి అప్పారావు, తలారి రమణారావు, యలమంచిలి వెంకటరావు, గురు భవానీ ఇల్లపు జువ్వాలు తదితరులు పాల్గొన్నారు.

దసరా వేళ.. కొండెక్కిన నాటుకోడి

ఆరిలోవ: దసరా ఉత్సవాల సందర్భంగా నాటుకోళ్ల ధరలు కొండెక్కుతున్నాయి. మటన్ ధరను మించి వీటి ధర పెరిగిపోతోంది. సాధారణంగా దసరాకు కంపెనీలు, యంత్రాలు, పెద్ద వాహనాలకు గొర్రెలు, నాటుకోళ్లు కోస్తుంటారు. డిమాండ్ పెరగడంతో వీటి ధర మటన్‌తో సమానంగా పెరిగిపోయింది. జాతీయ రహదారిపై డెయిరీఫారం వద్ద నిత్యం నాటుకోళ్ల సంత జరుగుతుంది. ఇక్కడ నాలుగు రోజులుగా వీటి ధరలు ఎగబాకాయి. ఇంతవరకు లైవ్ కిలో రూ.600 ఉండే ధర.. రూ.800కు పెరిగింది. రెండున్నర కిలోల కోడి కొంటే దాని నుంచి 2 కిలోల లోపే మాంసం పడుతుందని వినియోగదారులు చెబుతున్నారు. దసరా వేళ డిమాండ్ పెరగడంతో ధరలకు బాగా రెక్కలొచ్చాయని తప్పని పరిస్థితిలో కొనాల్సి వస్తోందని అంటున్నారు.



డెయిరీఫారం వద్ద విక్రయిస్తున్న నాటుకోళ్లు

ఘనంగా బతుకమ్మ సంబరాలు



ఉక్కునగరంలో బతుకమ్మ వేడుకలకు హాజరైన అతిథులు

ఉక్కునగరం: తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం బతుకమ్మ సంబరాలు ఉక్కునగరంలో ఘనంగా జరిగాయి. సీ భవనంలో జరిగిన కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) యు. శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ఉట్టిపడే విధంగా బతుకమ్మ సంబరాలు జరగడం హర్షణీయమన్నారు. ప్రతీ ఏడాది ఈ విధంగా జరుపుకోవడం తెలంగాణ ఉద్యోగుల ఐక్యతకు నిదర్శనమన్నారు. మహిళలు బతుకమ్మ పాటలతో ఆడిపాడి సందడి చేశారు. రంగురంగు పూలతో అలంకరించిన బతుకమ్మలను పేర్చారు. కార్యక్రమంలో జీఎంలు రవిశేఖర్, డాక్టర్ నవీన్‌కుమార్, సంఘం అధ్యక్షులు ఎస్. కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి జి. ఆనంద్, ఎన్. వీరేశం, మోహన్‌రావు, బి. వెంకటేశ్వర్లు, నర్సింగరావు, ప్రభాకర్, కె.వి.డి. ప్రసాద్, నరసింహ, మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉక్కునగరంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు